క్లుప్తంగా

నేటి నుంచి వాడపాలెంలో ఉచిత భిక్ష



వాడపాలెంలో అయ్యప్పస్వామి ఆలయం

కొత్తపేట: అయ్యప్పస్వామి మండల దీక్ష చేపట్టిన భక్తులకు వాడపాలెం అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఉచిత భోజనం (భిక్ష) కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జ్, భిక్ష కమిటీ సభ్యుడు మట్టా బాబ్జి తెలిపారు. ఏటా అయ్యప్ప స్వామి మండల దీక్ష చేపట్టిన భక్తులకు పలువురు దాతల సహకారంతో ఇక్కడ శాస్త్రోక్తంగా వండి వడ్డిస్తారు. నేటి నుంచి నవంబరు 14 వరకూ 42 రోజుల పాటు ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్ర శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, సభ్యులు పప్పుల సత్యవెంకటేష్, వరగన వరబాబు తదితరులు ఆధ్వర్యంలో ఉచిత భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే 42 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం స్వామికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు నిర్వహించారు.

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గంగయ్య కల్యాణ మండపంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రామానికి చెందిన మంగెన కుటుంబ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రికి చెందిన 40 మంది ప్రముఖ వైద్యులతో గుండె, మూత్రకోశం, కేన్సర్, ఈఎన్‌టీ, కిడ్నీ, చర్మ వ్యాధులు తదితర వైద్య సేవలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. స్కానింగ్, 2డీ ఎకో పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పి.గన్నవరం: మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. మండల పరిషత్ నిధులతో కుందాలపల్లిలో నాలుగు సీసీ రోడ్లు, డ్రైనేజీ, నరేంద్రపురంలో రెండు సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు, ముంగండలో సీసీ రోడ్డు, గ్రావెల్ రోడ్డు నిర్మాణాలకు, రక్షిత మంచినీటి పైపు లైన్ల విస్తరణ పనులకు మంగళవారం ఆమె భూమి పూజలు చేశారు. సర్పంచ్‌లు పప్పుల శ్రీనివాస్, బీర వెంగమాంబ, ఎంపీటీసీలు పప్పుల సాయిబాబు, కొక్కిరి లక్ష్మి, నాయకులు పెచ్చెట్టి వెర్రియ్య, నేలపూడి దుర్గారావు, పితాని రాంబాబు, అప్పారి సాయి తదితరులు పాల్గొన్నారు.

'కొబ్బరి'కి నిబంధనలు తొలగించాలి

మలికిపురం: కొబ్బరి తోటల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించే అంశంలో నిబంధనలు తొలగించాలని కొబ్బరి అభివృద్ధి బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి సత్య సీతారామరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొబ్బరి తోటల్లో చెట్లకు ఏటా బోదెలు తీసి ఎరువులు వేయాల్సిన అవసరం ఉందని, అయితే నిబంధనలు అంటూ మూడేళ్లకు ఒకసారి కొబ్బరి తోటలకు ఉపాధి కూలీలను పంపుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని కోరారు.

చిన్నారుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారుల వివరాలను సేకరించి అంగన్‌వాడీకి వచ్చేలా వారి సంఖ్య పెంచాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కేవలం ముగ్గురు విద్యార్థులు ఉండటంతో అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను ఆరా తీయగా పొంతన లేని సమాధానం చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అశుభ్రంగా ఉండటం గుర్తించి సత్వరమే శుభ్రం చేయించాలని సూచించారు. అంతకుముందు హాజరు పట్టీ, స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు.

డయాలసిస్ రోగికి పింఛన్ పంపిణీ

మామిడికుదురు: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న అప్పనపల్లి ఉచ్చులవారిపేటకు చెందిన ఇనుకపట్ల సత్యనారాయణకు ప్రభుత్వం ద్వారా నూతనంగా మంజూరైన రూ.10 వేల పింఛన్ సహాయాన్ని స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న మంగళవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అన్ని కులాలకు సంక్షేమ పథకాలతో పాటు రోగులకూ ఆర్థికసాయం అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే సురక్ష లక్ష్యం

- కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, కొండేటి చిట్టిబాబు



గోపాలపురంలో పౌష్టికాహార కిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పెదపట్నంలంకలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను గ్రామాల్లో నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం సచివాలయం–1 పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తేతల వారి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ క్యాంప్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కరోనా తర్వాత ఎక్కువగా గుండె సంబంధిత మరణాలు సంభవించడాన్ని చూసి వాటి నుంచి ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికీ మూడు రకాల టెస్టులు బీపీ, సుగర్, హిమోగ్లోబిన్‌కి సంబంధించిన పరీక్షలు నిర్వహించి నమోదు చేస్తారన్నారు. అలాగే శస్త్ర చికిత్సలకు అవసరమైన వారికి ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ సబ్బితి మోహన్‌రావు, చిర్ల రామచంద్రారెడ్డి, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మహమ్మద్ అన్వర్, వైద్యులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పార్టీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, తహసీల్దార్ ఐవీ శెట్టి, ఏపీఎం ఎం.ధనరాజు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్‌కు సత్కారం

మండలంలోని చెముడులంకలో శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించేందుకు విచ్చేసిన కలెక్టర్‌కు సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఘన స్వాగతం పలికారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి గ్రామస్తులకు వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ హిమాన్షుశుక్లాకు సర్పంచ్ తమ్మన దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలంకలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కుసుమ వనజకుమారి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శిబిరాన్ని సందర్శించారు. అక్కడ ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను స్వయంగా పరిశీలించారు. చిట్టిబాబు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు 501 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముంగండ–1 గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 256 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ చంద్రకళ, ఎంపీడీఓ ఎం.భారతి, మండల కన్వీనర్ నక్కా వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ బొడ్డు సురేష్, ఎంపీటీసీ ముక్కామల భారతి తదితరులు పాల్గొన్నారు.

పలివెలలో.

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. మండలంలోని పలివెలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.గంగాధరరావు, జెడ్పీటీసీ జి.రమాదేవి, ఎంపీటీసీ గునిపే శ్యామల, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని పసుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహించారు. శిబిరంలో సుమారు 350 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, డీటీ పి.నాగపద్మలక్ష్మి, ఎంపీడీఓ కె.సత్యనారాయణల సర్పంచ్ మట్టపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: సీఎం జగన్ అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరమని గుడిమెళ్లంక సర్పంచ్ నల్లి విజయకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.నరసింహారావు, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు .

రాజోలులో..

రాజోలు: ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో మేలు చేస్తుందని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. మంగళవారం కడలిలో సురక్ష శిబిరం ప్రారంభించారు. వైద్య శిబిరంలో సుమారు 350 మంది రోగులను పరీక్షించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.బాలాజీ, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, నాయకులు కంచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో..

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో జి.భీమారావు ఆధ్వర్యంలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ప్రారంభించారు. శిబిరంలో ఓపీలో 430 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య మిత్రలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, గారపాటి గంగారామ్ చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని అంకంపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీవో నాతి బుజ్జి, వైద్యాధికారి సునీత ఆధ్వర్యంలో వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యం అందించారు. 443 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సర్పంచ్ వారా జయ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 411 మందికి వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చెముడులంకలో కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఘనంగా సత్కరిస్తున్న సర్పంచ్ తమ్మన



పసుపల్లిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



పలివెలలో వైద్య సేవలు పరిశీలిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఆలమూరు: ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, పారదర్శకతే ప్రామాణికంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ మండలంలోని బడుగువానిలంకలో మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరా రాజు, పార్టీ నేత కర్రి నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల కలిగిన లబ్ధిని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నవరత్న పథకాల వల్ల రికార్డు స్థాయిలో రూ.14.13 కోట్లు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రూ.2.17 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, దూలం సత్తిబాబు, పెంటపాటి వెంకట్రావు, దూలం భద్రరావు తదితరులు పాల్గొన్నారు.



బడుగువానిలంకలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

సంక్షేమ పథకాల అమలులో ఏపీ ముందంజ

రాజోలు: సంక్షేమ పథకాల అమలు చేయడంలో ఏపీ ముందంజలో ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం పొన్నమండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పొందిన లబ్ధిని కరపత్రాలు అందించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో సంక్షేమం విరాజిల్లుతుందన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు అమలు చేసి ప్రజల అవసరాలను తీర్చుతున్నారన్నారు. సర్పంచ్ కుక్కల బేబికుమారి, జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కడలి సత్యనారాయణ, నాయకులు గెద్దం బుల్లిబ్బాయి, చెల్లింగి రాజబాబు, కుక్కల శ్రీను, రాపాక శ్రీను, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నమండలో మహిళకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రోగులకు పించన్ల పంపిణీ

రాజోలు/మలికిపురం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స కోసం నర్సాపురం వెళ్లిన మెరకపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు యెలుమర్తి చంద్రకాంతమ్మకు వలంటీర్ యెలుమర్తి నవీన్‌కుమార్ నర్సాపురం వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. అలాగే మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు కందికట్ల దీనమ్మ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ సాయినాథ్ కాకినాడ వెళ్లి ఆమెకు పింఛన్ అందించాడు. వలంటీర్లను ఆయా గ్రామాల అధికారులు అభినందించారు.



కాకినాడ ఆసుపత్రిలో దీనమ్మకు, నర్సాపురంలో చంద్రకాంతమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు

బ్రహ్మాస్త్రంతోనే పురుగుల నివారణ

అంబాజీపేట: పంటల్లో కాండం, కాయ తొలిచే పురుగులను అరికట్టేందుకు బ్రహ్మాస్త్రంతోనే సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ అసోసియేషన్ ప్రతినిధి హేమలత అన్నారు. పుల్లేటికుర్రులో ఎల్2 శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతు చిత్రపు దామోదరరావు పొలంలో మంగళవారం బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ వేపాకు 3, సీతాఫలం 2, ఆముదం ఆకు, తూడికాడ ఆకు రెండు కేజీల చొప్పున, ఆవు మూత్రం 10 లీటర్లు తీసుకోవాలన్నారు. అన్నీ కలిపి బాగా మరిగించాలన్నారు. అనంతరం చల్లారిన తరువాత 5 లీటర్ల కషాయాన్ని ఒక ఎకరానికి స్ప్రే చేసుకోవాలన్నారు. పంటలో రసాయన ఎరువులు వినియోగించకుండా సహజ సిద్ధమైన బ్రహ్మాస్త్రాన్ని వినియోగిస్తే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు నేస్తం'తో ఆర్థిక పురోభివృద్ధి

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు నేస్తం పథకం ద్వారా రైతన్నలు ఆర్థిక పురోభివృద్ధి చెందేందుకు భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట డీసీసీ బ్యాంకులో రైతునేస్తం పథకం ద్వారా మంజూరైన గంగలకుర్రు సొసైటీకి చెందిన ఆరుగురు రైతులకు రూ.23.60 లక్షల చెక్కులను సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సంఘ సభ్యులకు ఎకరాకు రూ.8 లక్షల రుణాన్ని 12 శాతం వడ్డీతో పదేళ్ల కాల పరిమితికి డీసీసీబీ ద్వారా అందిస్తున్నామన్నారు. గరిష్ఠంగా రూ.20 లక్షల వరకూ రుణం పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని సొసైటీ అభివృద్ధితో పాటు, రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాసరావు, డీసీసీ బ్యాంక్ మేనేజర్ బి.నాగేశ్వరరావు, సీఈఓ జి.శంకర్, రైతులు పితాని సత్తిబాబు, కొండేటి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో రైతు నేస్తం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

ఆలమూరు: రక్షిత తాగునీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంక రూ.37.7 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ వ్యాప్తంగా రూ.26.2 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద అనేక వాటర్ ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో గ్రామంలో ఎంతో కాలంగా ఉన్న ప్రధాన మేజర్ డ్రైన్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. అలాగే రికార్డు స్థాయిలో సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, తదితర భవనాలు నిర్మిస్తున్నామన్నారు. వాటర్ ట్యాంకు నిర్మాణం తరువాత గ్రామంలోని సుమారు 1200 కుటుంబాలకు రూ.54 లక్షలతో ఇంటింటికీ పైప్‌లైన్ వేసి కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, తమ్మన హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు పునర్నిర్మాణంపై హర్షం

రాజోలు: పొన్నమండ ఉన్నత పాఠశాల పైకప్పు పునర్నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల పైకప్పు పాడైపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు గమనించి జెడ్పీటీసీ మట్టా శైలజ రూ.5 లక్షల నిధులు కేటాయించారు. ఆ నిధులతో పైకప్పు పునర్నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఆ పూర్తయిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పాఠశాల పైకప్పు నిర్మాణానికి నిధులు కేటాయించిన జెడ్పీటీసీ శైలజను ఎమ్మెల్యే రాపాక అభినందించారు. ప్రధానోపాధ్యాయిని ఆరుమిల్లి రోహిణి, ఎంఈఓ నల్లి మనోహరం, సర్పంచ్ కుక్కల బేబికుమారి తదితరులు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

పాఠశాలలకు క్రీడాసామగ్రి అందజేత



పాఠశాలలకు మంజూరైన క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రభుత్వం పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 54 పాఠశాలలకు, హైస్కూళ్లకు మంజూరైన కిట్లను జగ్గిరెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎంలు, విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ–2 బైర్రాజు శ్రీనివాసరాజు, సీఆర్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన 17 రకాల ఆట వస్తువులతో కూడిన క్రీడాసామగ్రిని పాఠశాలలకు జగ్గిరెడ్డి అందించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'పాలూరి'

కొత్తపేట: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొత్తపేటకు చెందిన పాలూరి సత్యానందం నియమితులయ్యారు. ఆ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియామక పత్రాన్ని పంపినట్టు పాలూరి మంగళవారం విలేకరులకు తెలిపారు. బీజేపీలో పాలూరి మండల యువమోర్చా, మండల పార్టీ పదవులతో పాటు జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్‌గా, రాష్ట్ర కిసాన్‌మోర్చా, టెలికం సెల్ కన్వీనర్‌గా, ప్రస్తుతం రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్‌గా పనిచేశారు. తాజాగా రాష్ట్రంలో పురందేశ్వరి నాయకత్వంలో నూతన కమిటీ ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు.

మారుమూల ప్రాంతాల్లో పక్కా రహదారులు

మామిడికుదురు: మారు మూల ప్రాంతాల్లోనూ పక్కా రహదారులు నిర్మించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. లూటుకుర్రు శివారు బాడిలంక కరకట్టపై రూ.10 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుతో పాటు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న షెడ్డుకు, గడప గడపకు నిధులు రూ.18 లక్షలతో వివిధ ప్రాంతాల్లో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే చిట్టిబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు నిధులతో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నేతలు అడబాల చక్రపాణి, పాలూరి పాండురంగారావు, అప్పన రామారావు, భూపతిరాజు సతీష్‌రాజు, కుసుమ హర్ష, పితాని సురేంద్ర, పీఆర్ ఏఈ కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

పందులను అరికట్టాలి

అంబాజీపేట: తరచూ పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ అరటి, కూరగాయల తోటలను ధ్వంసం చేయడం వల్ల తమకు అపార నష్టం కలిగిస్తున్నాయని వాటిని తక్షణమే అరికట్టాలని మాచవరం గ్రామ రైతులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పందులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కార్యదర్శి కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇంతకు ముందు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఇప్పటికైనా స్పందించకపోతే ఈసారి కలెక్టర్ ఫిర్యాదు చేసి రిలే నిరాహార దీక్షలు చేస్తామని రైతులు హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, రైతులు నక్కా భాస్కరరావు, పొట్టుపోతు స్వామినాయుడు, మేడిది దొరబాబు, మట్టపర్తి పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.